సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



అదిగో పులి..!
లక్కిరెడ్డిపల్లి మండలంలోని మామిడి తోటలో పులి సంచరిస్తోందంటూ వాట్సాప్ గ్రూపుల్లో కొందరు వీడియోను వైరల్ చేశారు. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. - 8లో



పూజారే సూత్రధారి
ములకలచెరువు మండలం కనుగొండ అటవీ ప్రాంతంలో ఉన్న అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయం ధ్వంసం ఘటనలో పూజారే సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.550	రూ.640
రెండోరకం	రూ.410	రూ.540

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 92 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వందశాతం అక్షరాస్యత జిల్లాగా మార్చడమే ధ్యేయం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : వంద శాతం అక్షరాస్యత కల్గిన జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి ఉల్లాస్ కార్యక్రమంపై వివిధ అంశాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సమాజంలోని వివిధ వృత్తులలో ఉన్న 15 ఏళ్లకు పైబడిన వయోజనులను దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. సమావేశంలో పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ, డీపీఓ బాలకృష్ణారెడ్డి, డీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పింఛా ప్రాజెక్ట్ సందర్శన



పింఛా ప్రాజెక్టును సందర్శిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

సుండుపల్లె : మూడు రోజులుగా కురుస్తున్న తుపానుకు డ్యామ్‌లోకి వర్షపు నీరు రావడంతో పూర్వ వైభవం సంతరించుకుంది. 2021 నవంబర్ 27న భారీ వరదల కారణంగా తెగిపోయిన పింఛా డ్యామ్‌కు గత ప్రభుత్వం మరమ్మతులు చేయించింది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్యామ్‌లోకి వరద నీరు వచ్చింది. దీంతో జలకళ సంతరించుకుంది. రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 164 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 10 క్యూసెక్కులు నీరు అవుట్ ఫ్లోగా ఉందని జల వనరుల శాఖ అధికారి వెంకట్రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంగల్ రాయుడు, ఏఈ నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న టమాట ధరలు



కలకడ మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

కలకడ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు టమాట ధరలు తగ్గినా.. గురువారం స్థానిక మార్కెట్‌కు అధికంగా బయటి నుంచి వ్యాపారులు రావడంతో రేట్లు కొంత పెరిగాయి. 15 కిలోల బాక్స్ ధర రూ.800 వరకు పలకడంతో టమాట పంట సాగు చేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వర్షానికి దెబ్బతినడంతో పంటలు కాపాడుకోవడానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే టమాట పండ్లలో పగుళ్లు రావడంతో కొంత వృథా అవుతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ విద్యార్థినికి ప్రశంస



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తేజస్విని

తంబళ్లపల్లె : పల్లెటూరులోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి ఆలిండియా టాప్ ర్యాంకు సాధించిన తేజశ్విని.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసలు అందుకుంది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురామిరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజస్విని గుంటూరు మాస్టర్ మైండ్స్‌లో సీఏ చదివింది. జూలైలో విడుదలైన సీఏ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా 14వ ర్యాంకు దక్కించుకుంది. ఆగస్టులో విడుదలైన సీఎంఏ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించింది. మొదటిసారి రెండు పరీక్షలు ఒకే సారి రాసి ఆలిండియా టాపర్‌గా నిలవడం విశేషం. రాష్ట్ర సచివాలయం, మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం ఆహ్వానం మేరకు తేజస్విని తండ్రి రఘురామిరెడ్డి, బాబాయ్ అమరనాథరెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్ఛం అందించారు. ఆ బాలికను సీఎం అభినందిస్తూ ప్రశంసించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పేరు ప్రతిష్టలు నిలపడం గర్వంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన మాస్టర్‌మైండ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఆ బాలిక కుటుంబ నేపథ్యం అడిగి తెలుసుకున్నారు.

ముంచిన వాన

- మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు
- రాజంపేట, రైల్వేకోడూరులో అత్యధికం
- దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు
- రైతులు కుదేలు

అన్నదాతను తుపాను నిలువునా ముంచేసింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలైంది. వ్యవసాయ, ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



నందలూరులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



సుండుపల్లె మండలం ఏటిగడ్డ రాచపల్లి వద్ద నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రాయచోటి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు వర్షాలు కురిశాయి. సోమవారం నుంచి ప్రారంభమై.. బుధవారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా కురిసింది. పంటలపై ప్రభావం చూపడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలతోపాటు నీటి వసతి ఉన్న చాలా మంది రైతులు.. ఈ ఏడాది ముందస్తుగా వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంట కోత దశకు చేరుకుంది. మరో రెండు, మూడు రోజుల్లో కోతలు ప్రారంభించాలనుకున్న తరుణంలో తుపాను అన్నదాతలను నిలువునా ముంచేసింది. రైతుల కష్టమంతా వర్షార్పణమయింది. జిల్లాలో చాలా చోట్ల వర్షం ధాటికి వరి పంట పూర్తిగా నేల వాలింది. కిందపడిపోయిన వరికంకులు నెమ్ముతో మొసులొచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు కింద పడిన వరిని కోయాలన్నా చాలా కష్టం. ప్రస్తుతం కింద పడిన వరిని కోయాలంటే వరి కోత మిషన్‌తో సాధ్యం కాదు. భూమి ఆరే వరకు ఉంటేనేమో గింజలన్నీ మొలకెత్తే అవకాశం ఉంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- వేరుశనగ, మినుము, మొక్కజొన్న, కంది పంటల్లో కూడా వర్షపు నీరు నిల్వ ఉండటంతో పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా వేరుశనగ కోతదశకు వచ్చింది. ఈ పంటల్లో నిలిచిన నీటితో కాయలకు మొసులు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుము కూడా కొన్ని చోట్ల కోతదశలో ఉంది. ఈ వర్షంతో ఆ పంటలన్నీ దెబ్బతిన్నాయి.
- చాలా మండలాల్లో ఉల్లి పంట కూడా కోతదశకు వచ్చింది. మరో నాలుగైదు రోజుల్లో ఉల్లి కోసేందుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలోనే వర్షం రావడంతో పొలాల్లో నీరంతా నిలిచిందని, ఈ నీటిలో ఎర్రగడ్డలు కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకుని పంటనష్ట పరిహారం చెల్లించాలని వారు వేడుకుంటున్నారు.

వరి వర్షార్పణం

జిల్లాలో ప్రధానంగా వరి పంట వర్షార్పణమైంది. వంద హెక్టార్లలో ఈ పంట నేల పాలైంది. 10 ఎకరాలలో అరటి, 35 ఎకరాలలో బొప్పాయి, 5 ఎకరాలలో టమాట తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రూ.60 లక్షల మేర పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదికలు కలెక్టర్‌కు పంపారు. ఈ నష్టం అంతా రాజంపేట, కోడూరు నియోజక వర్గాలలోనే జరిగినట్లు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు చెబుతున్నారు.

భారీగా వర్షపాతం

రైల్వేకోడూరులో బుధవారం ఏకంగా 144 మిల్లీమీటర్ల మేర భారీ వర్షపాతం నమోదైంది. నందలూరులో 77.4, పెనగలూరు 53.2, చిట్వేలి 84.6, రాజంపేట 71.6, పుల్లంపేట 102.4, ఓబులవారిపల్లి 90.8, వీరబల్లిలో 61.8 మిల్లీమీటర్ల మేర నమోదైంది. మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

గురువారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడులో 48 మిల్లీ మీటర్లు, చిన్నమండెం 33.6, సంబేపల్లి 34.2, టి.సుండుపల్లి 52.4, రాయచోటి 61, లక్కిరెడ్డిపల్లి 33, రామాపురం 38.8, వీరబల్లి 61.8, నందలూరు 77.4. పెనగలూరు 66.6, చిట్వేలి 84.6, రాజంపేట 71.6, పుల్లంపేట 102.4, ఓబులవారిపల్లి 90.8, రైల్వేకోడూరు 144, ములకల చెరువు 21.8, తంబళ్లపల్లె 32.6, పెద్దమండెం 52.2, గుర్రంకొండ 24.8, కలకడ 24, కుంభంవారిపల్లి 28.2, పీలేరు 19.6, కలికిరి 14.4, వాల్మీకిపురం 28.6, కురబలకోట 19, పెద్దతిప్పసముద్రం 19, బి.కొత్తపేట 16.8, మదనపల్లి 21.2, నిమ్మనపల్లి 14.8, రామసముద్రం 21.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

నందలూరు : మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలను రాజంపేట ఉద్యాన అధికారి సురేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి జి.మల్లికార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వ్యవసాయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ అధిక వర్షాలకు వరిపొలాలలో నిలిచిన నీటిని ప్రత్యేక కాలువలు ద్వారా వెంటనే బయటకు పంపాలని తెలిపారు. నేలకొరిగిన వరిపైరును కట్టలుగా కట్టి నిలబెట్టాలన్నారు. కోతకోసి నిల్వ ఉంచిన వరికుప్పలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి జి.సురేష్, నందలూరు వీఏఏఎం షణ్ముక్, వీహెచ్‌ఏ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరిమడి

సుండుపల్లె : తుపాను కారణంగా నేలమట్టమై నీటిలో మునిగిన వరిమళ్లను మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏటిగడ్డ రాచపల్లి వద్ద వరిమడిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భారీ వర్షం కారణంగా నేలమట్టమైన వరిమడిలో మొలకలు వచ్చాయన్నారు. నష్టపోయిన పంటల వివరాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

నివేదిక అందిస్తాం

సిద్దవటం : మండలంలోని జంగాపల్లె, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, జ్యోతి గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2574 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారని, 57 ఎకరాల్లో వరి పంట నష్టం ఉంటుందని ప్రాథమిక అంచనా వేసి జిల్లా వ్యవసాయాధికారికి నివేదిక సమర్పిస్తామన్నారు. ఈయన వెంట రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి

ఓబులవారిపల్లె : ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారిణి మల్లిక పేర్కొన్నారు. గురువారం యల్లాయపల్లి గ్రామంలో అరటి, బొప్పాయి తదితర పంటలను ఆమె ఉద్యానశాఖ అధికారి భాస్కర్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అరటి తోటలో పంట నష్టం జరగకుండా నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. అనంతరం బొప్పాయి, వరిపంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె మండలం యల్లాయపల్లిలో అరటి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన అధికారులు

పెన్నా పరవళ్లు



సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని పెన్నానది గురువారం తెల్లవారుజాము నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్నా నదీ పరివాహ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు నది లోకి వచ్చి చేరుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం ఎస్‌ఐ చిరంజీవి హెచ్చరికలు జారీ చేశారు. ఎవరూ కూడా పెన్నానది లోకి దిగకూడదని, పెన్నాల్లో సుడిగుండాలు ఉన్నాయన్నారు. చేపలు పట్టే వారు కూడా పెన్నాలోకి దిగకూడదని హెచ్చరించారు.

జలపాత సోయగం

రామాపురం : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని మొదటి మలుపు సమీపంలో కొండపై నుంచి జలపాతం రావడంతో ఆకర్షణీయంగా మారింది. ఈ సుందర దృశ్యాన్ని చూడటానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. అలాగే ప్రయాణికులు తమ వాహనాలను ఆపి తిలకించి ఆనంద భరితులవుతున్నారు. ఈ జలపాతం నీరు కింద గల గువ్వలచెరువు తూర్పు భాగంలోని చెరువులోకి చేరుకుంటున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి గోడపై పిడుగు

ట్రాన్స్‌ఫార్మర్ కాలి అంధకారం

బి.కొత్తకోట : మండల పరిధి శీలంవారిపల్లె దళితవాడలోని ఓ ఇంటి గోడపై గురువారం పిడుగు పడటంతో రంధ్రం ఏర్పడటంతో పాటు ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి అంధకారం నెలకొంది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. స్థానికురాలు నీరుగట్టి జయమ్మ ఇంటి కిటికీలోంచి ఎదురుగా ఉన్న గోడపైకి పిడుగు వెళ్లి పడింది. దీనితో గోడకు రంధ్రం పడింది. ఆ సమయంలో ఇంటిలో వంట చేస్తున్న జయమ్మకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పిడుగు ప్రభావానికి పల్లెకు విద్యుత్ సరఫరా అందిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీనివల్ల ఇళ్లకు ఉన్న సరఫరా వైర్లు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో గ్రామస్తులు చీకట్లోనే ఉండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచు భీమిగాని నాగిరెడ్డి దళితవాడకు వెళ్లి స్థానికులతో మాట్లాడి ప్రభుత్వశాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఇంటి గోడకు పడిన రంధ్రం

వాల్మీకి జీవితం.. ఆదర్శనీయం



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి అర్బన్ : రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకొంటున్నామన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులు అవుతారు అనడానికి వాల్మీకి మహర్షి ఒక ఉదాహరణ అన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నందప్ప, డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం, వాల్మీకి సంఘం అధ్యక్షుడు భక్తవత్సలం, వాల్మీకి సేవాదళ్ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప, యోగానందబాబు, కురబలకోట చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామయ్య పౌర్ణమి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న శ్రీ ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల ఉత్సవ మూర్తులకు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. ముందుగా బాలాలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆసీనులు చేసి పట్టు వస్త్రాలు, పుష్పమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు వైభవంగా కల్యాణ తంతు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాలను భక్తులకు అందజేశారు. లోక కల్యాణాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు.

గజ గజ

- పీలేరులో ఒకరిని తొక్కి చంపిన ఏనుగులు
- పొలాల్లో పంటలను నాశనం చేస్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



పీలేరు సమీపంలో అడవి నుంచి బయటకు వచ్చిన ఏనుగులను వెనక్కి పంపుతున్న అటవీ శాఖ అధికారులు

సాక్షి రాయచోటి : గజరాజుల భీంకారం వెంటాడుతోంది. దీంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. అడవుల్లో దారి తప్పో.. లేక ఆకలి దప్పికలు, నీటి కోసమో ఏనుగులు పొలాల వైపు అడుగులు వేస్తున్నాయి. పెద్ద ఏనుగులు మాత్రమే వస్తే నేరుగా దాడులు అంతగా ఉండవు. కానీ పిల్ల ఏనుగులతో కలిసి వస్తే దాడులు తప్పవు. ఇలాంటి విపత్కర పరిస్థితులు అప్పుడప్పుడు తలెత్తుతున్నాయి. పక్కన ఉన్న చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపులు పొలంలోకి వచ్చి విధ్వంసం సృష్టించడం కనిపిస్తూ ఉంటుంది. కానీ అన్నమయ్య జిల్లాలో ఎప్పుడో ఒకసారి వచ్చినా.. ఏదో ఒక అలజడి చేస్తూనే ఉన్నాయి. గజరాజుల దాడులతో పలువురు మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగించే పరిణామం.

అష్టకష్టాలు పడుతున్న అటవీ శాఖ అధికారులు

అడవిలో నుంచి పొలాలపైకి ఏనుగులు వచ్చిన సందర్భంలోనూ.. వాటిని తిప్పి మళ్లీ అడవిలోకి పంపించడానికి అధికారులకు కష్టాలు తప్పడం లేదు. సాధారణంగా అధికారులు ట్రైనింగ్ ఇచ్చిన కుంకీ ఏనుగుల ద్వారా అయితే వాటిని సులభంగా మళ్లించే అవకాశం ఉంటుంది. కానీ అన్నమయ్య జిల్లాలో ఎప్పుడో ఒకసారి ఏనుగులు జనావాసంలోకి రావడం, దాడులు చేస్తుండటంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏనుగులు కనిపించడం లేదు. అయితే గత పదేళ్లుగా పరిశీలిస్తే ఏదో ఒక చోట ఏనుగుల గుంపు ప్రజలపై దాడులు చేస్తూనే ఉన్నాయి.

కొండలు ఆనుకోని ఉన్న గ్రామాల్లో ఆందోళనలు

రెండు రోజుల క్రితం పీలేరు పట్టణం ఆటోనగర్ సమీపంలో రాజారెడ్డి అనే వ్యక్తిపై ఏనుగుల గుంపు తొక్కి దాడి చేసి చంపడంతో.. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చుట్టు పక్కల ప్రాంతాలతోపాటు కొండ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాల్లోనూ భయం వెంటాడుతోంది. రెండు రోజుల క్రితం అడవిలోకి ఏనుగులను అటవీ శాఖ అధికారులు మళ్లించారు. అయితే మళ్లీ అడవిలో నుంచి బయటకు వస్తే జనాలపై దాడులు చేస్తాయని ఒకింత భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో జరిగిన ఉదంతాలు

- కలికిరి - వాల్మీకిపురం మండలాల సరిహద్దులోని గుట్టుపాలెం, మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలోకి ఫిబ్రవరిలో రెండు ఏనుగులు దారి తప్పి వచ్చాయి. అటవీ శివారు ప్రాంతంలో అరటి, వరి, టమాట పొలాలను తొక్కి నష్టపరిచాయి. చిత్తూరు జిల్లా సోమల, చౌడేపల్లె అటవీ ప్రాంత సరిహద్దుల నుంచి దారి తప్పిన ఏనుగులు ఇక్కడికి రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పొలాల వద్ద ఏనుగుల సంచారాన్ని చూసిన రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వారు అప్రమత్తమయ్యారు.
- ఏడాది క్రితం దారి తప్పిన ఒంటరి ఏనుగు కలికిరి- వాల్మీకిపురం మండలాల సరిహద్దులోని అరటి తోటపై పడి విధ్వంసం సృష్టించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.
- 5 ఏళ్ల క్రితం పలమనేరు మొగిలి అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ ఒంటరి ఏనుగు రామసముద్రం సమీపంలో కొండపై చిక్కుకుపోవడంతో.. శిక్షణ పొందిన మరో రెండు ఏనుగుల సాయంతో దాన్ని కొండ దించారు. అయితే ఇదే ఏనుగు బుసానికురప్పల్లె గ్రామంపై పడి ఓ వృద్ధుడిని కాళ్లతో తొక్కి చంపేసింది.
- మదనపల్లెలో డ్రామా చూసి సీటీఎం మీదుగా వాయల్పాడు వెళుతున్న తండ్రీకొడుకులపై ఏనుగులు దాడి చేసి చంపేశాయి. అయిదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన అప్పట్లో సంచలనం రేకెత్తించింది. ఇలా ఇప్పటికే పలువురు ఏనుగుల గుంపు చేతిలో మృత్యువాతపడ్డారు.
- పదేళ్ల క్రితం ఇదే మండలం చిన్నకంపెడ్డిగారిపల్లె సమీపంలోని వ్యవసాయ పంట పొలాలపై ఏనుగుల గుంపు పడి పంటను ధ్వంసం చేశాయి.
- 15 ఏళ్ల క్రితం కంభంవారిపల్ల మండలం జిల్లేళ్ల మంద సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఏనుగుల గుంపు సంచరించింది. వ్యవసాయ పంట పొలాలను ధ్వంసం చేయడమేకాక ఓ రైతును కూడా పొట్టన పెట్టుకున్నాయి.

క్లుప్తంగా

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం కానసానోళ్లపల్లె పంచాయతీ, సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన, శివశంకర్ కుమార్తె శిరీష (21) మదనపల్లి పట్టణంలో డిగ్రీ చదువుతోంది. గురువారం కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేని సమయంలో పురుగుమందు తాగింది. పెద్దమండ్యం మండలం చెరువు కిందపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు చలపతి(35) కుటుంబ సమస్యలతో పురుగు మందు తాగాడు. మదనపల్లి మండలం సీటీఎంకు చెందిన శంకర కుమారుడు రామాంజులు (30) కుటుంబ సమస్యల కారణంగా పురుగుమందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన రామయ్య

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం దళితవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలయ్యాయి. వివరాలిలా.. అనంతపురం వడ్డిపల్లికి చెందిన రామయ్య తన కుమారుడు మల్లికార్జునతో కలిసి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో లక్కిరెడ్డిపల్లికి బయలుదేరాడు. అనంతపురం దళితవాడ వద్దకు రాగానే కుక్క అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు బంధువులు తెలిపారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మదనపల్లె : గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం మదనపల్లె పట్టణంలో జరిగింది. వన్ టౌన్ పరిధిలోని తూర్పు కొత్తపేట వద్ద రోడ్డు పక్కన సుమారు 45–50 మధ్య వయసు గల ఓ వ్యక్తి మృతి చెందిపడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న వన్ టౌన్ పోలీసులు మృతుని వివరాలు కనుగొనేందుకు ప్రయత్నించారు. స్థానికులు తమకు తెలియదని చెప్పడంతో మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇటీవల వర్షాలకు తాళలేక యాచకుడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అతని సంబంధికులు ఎవరైనా ఉంటే మదనపల్లె వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ చాంద్ బాషా తెలిపారు.

ఆలయం ధ్వంసం కేసులో పూజారే సూత్రధారి

- ఆరుగురు నిందితుల అరెస్టు
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: ములకల చెరువు మండలం, కనుగొండ అటవీ ప్రాంతంలో ఉన్న అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయం ధ్వంసం ఘటనలో ఆలయ పూజారే సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. ఈమేరకు ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం రాయచోటిలోని ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అడవిలోని అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 14వ తేదీన ధ్వంసం చేశారంటూ ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మదనపల్లి డీఎస్పీ పర్యవేక్షణలో ములకలచెరువు సీఐ రాజా రమేష్, ఎస్ఐ గాయత్రి సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం ములకలచెరువు–కదిరి మార్గంలోని ములకలచెరువు చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆలయ పూజారి హరినాథ్‌కు ఆలయ నిర్వాహకుడు విద్యాసాగర్‌కు మధ్య నెలకొన్న గొడవలే ఆలయ విధ్వంసం ఘటనకు దారితీశాయని ఎస్పీ తెలిపారు. ఆలయ నిర్వహణ బాధ్యతల నుంచి విద్యాసాగర్ తప్పుకోవాలని పూజారి సూచించారన్నారు. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని తాను ఒక్కడే తీసుకోవాల్నన దుర్బుద్ధితో పూజారి ఆలయ నిర్వాహకులతో గొడవపడినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ దశలో గ్రామంలోని కొంతమంది యువకులను చేరదీసి ఆలయం కింద గుప్త నిధులు ఉన్నాయని వారికి ఆశ చూపించినట్లు తెలిపారు. పూజారి హరినాథ్, ఎం. మహేశ్వర్ రెడ్డి, టి.లక్ష్మీనారాయణ, బి.రాఘవేంద్ర ఆచారి, సి.మధు, షేక్ ఇల్లాహీలు ఆలయ ధ్వంసంలో పాల్గొన్నట్లు తేలిందన్నారు. ముందుగా జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి పేల్చే ప్రయత్నం చేశారన్నారు. వీలు కాకపోవడంతో సమ్మెటలు, గడ్డపారలు, గొడ్డళ్లతో ధ్వంసం చేసే ప్రయత్నం చేశారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుంచి ఆలయ ధ్వంసానికి ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

భవిష్యత్తును శాసించేది కృత్రిమ మేధ

అమెరికాలోని అట్లాంటా ప్రొఫెసర్ జూబ్లీ ప్రసాదరావు


మిట్స్ కళాశాల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అమెరికన్ ప్రొఫెసర్ జూబ్లీ ప్రసాదరావు

కురబలకోట : భగవంతుడి సృష్టిలో మనిషి గొప్పవాడయితే మనిషి సృష్టించిన వాటిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కృత్రిమే మేధ మహోన్నతంగా నిలవనుందని అమెరికా అట్లాంటాలోని జార్జియా సిటీ జీఏ గ్లోబల్ టెక్నాలజీ కనెక్షన్ ప్రిన్సిపల్ ఆర్ అండ్ డి ఇంజినీర్ జూబ్లీ ప్రసాదరావు అన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీయింగ్ కేరీర్ రెడీ ఇన్ ది న్యూ ఏఐ డ్రైవన్ వరల్డ్ అంశంపై గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, రవాణాతో సహా అనేక పరిశ్రమల్లో గేమ్ చేంజర్‌గా నిరూపితమైందన్నారు.

ప్రపంచంలో వివిధ రంగాలకు ఇది వేగంగా విస్తరిస్తోందన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించ గల స్థాయిలో ఏఐ మారబోతోందని చెప్పారు. రెండు వైపులా పదునున్న కత్తిలా ఇది ఉండబోతోందన్నారు. జటిలమైన సమస్యలను సులభంగా పరిష్కరిస్తుందన్నారు. వ్యాపార, వాణిజ్య, సేవా రంగాల్లో అవసరమైన సాధనంగా మారుతోందన్నారు. తద్వారా అభివృద్ధి వేగంగా ఉండగలదన్నారు. మెకానికల్ ఇంజినీర్ల పాత్ర కీలకంగా మారిందన్నారు. ఉద్యోగావకాశాలు కూడా మెరుగ్గా ఉంటాయని తెలిపారు. భవిష్యత్తు మొత్తం ఇక ఏఐ రంగానిదేనన్నారు. ప్రపంచంలో వినూత్న మార్పులకు ఇది వారధి కాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యం


షేక్ జానీబాషా (ఫైల్)

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ జానీబాషా అనే వ్యక్తి గత ఇరవై రోజులుగా కనిపించడం లేదని ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. జానీబాషా అన్న షేక్ అజ్మతుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. జానీబాషాకు మతిస్థిమితం లేక గత రెండు సంవత్సరాల నుంచి చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పెనగలూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

వ్యక్తి మృతిపై బంధువుల ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని సిటికే మాలపల్లికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి మృతిపై అనుమానం ఉందని బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుధాకర్ వీరబల్లి పంచాయతీలోని తొట్టికాడ హరిజనవాడలో వివాహం చేసుకున్నాడు. ఆయన భార్య బతుకుదెరువు నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. అప్పటి నుంచి అత్తగారి ఇంటివద్దనే జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఈనెల 6వ తేదీన సుధాకర్ మృతి చెందగా అంత్యక్రియలు కూడా నిర్వహించారు. అయితే బంధువులు సుధాకర్‌ది సహజ మరణం కాదని, మద్యంలో విషం కలిపి తాపించారని అందువల్లే అతను చనిపోయాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పసుపులేటికి ఆంధ్రరత్న గౌరవం


డాక్టర్ పసుపులేటి శంకర్

ఒంటిమిట్ట : అఖిల భారత తెలుగు సంస్కృతి సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న 24వ ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవంలో వైఎస్సార్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్‌కు వీఐపీ విభాగం కింద ఆంధ్రరత్న గౌరవ పురస్కారం ఇవ్వనున్నారు. విజయవాడలో ఈనెల 21న కార్యక్రమం జరగనుంది.

ఇసుక రీచ్‌ను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో నూతన ఇసుక రీచ్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇసుక ప్రజలందరికి అందుబాటులో ఉండాలని రీచ్‌ను ప్రారంభించామన్నారు.

ఈవీఎంల అక్రమాలపై 19న సమావేశం

కడప రూరల్ : ఈనెల 19వ తేదీన మహాజన రాజ్యం పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల అక్రమాలు, ఈవీఎంల అవకతవకలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ తెలిపారు. కడప నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్ లో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పాడి ఆవులు మృతి


విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన పాడి ఆవులు

మదనపల్లె : వెల్డింగ్‌షాపు దగ్గరికి వెళ్లిన రెండు పాడి ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. బసినికొండ జన్మభూమి కాలనీకి చెందిన రైతు రమణయ్య పాడి ఆవులను మేపుకుంటూ, వాటిద్వారా వచ్చిన పాలను అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆవులను మేపేందుకు బసినికొండ వై జంక్షన్ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ సమీపంలోకి తోలుకెళ్లాడు. ఆవులు మేత మేస్తున్న సమయంలో ఉన్నట్లుండి వర్షం జోరుగా రావడంతో ఆవులు రోడ్డుకు అటువైపుగా ఉన్న వెల్డింగ్‌షాపు వద్దకు వెళ్లాయి. వెల్డింగ్‌షాపులో వెల్డింగ్ చేసేందుకు వీలుగా అమర్చిన కమ్మీ తగులుకుని రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు సరఫరా నిలిపివేసి ఘటనకు జరిగిన కారణాలపై ఆరా తీశారు. ఈ విషయమై స్థానికులు మాట్లాడుతూ... వెల్డింగ్‌షాపు నిర్వాహకులు వెల్డింగ్‌కు ఉపయోగించే వైర్లు అతుకులతో, ఎర్త్ వైర్ కిందకు ఉండటంతో షాపులోని రేకులకు, కమ్మీలకు కరెంటు సరఫరా జరిగిందన్నారు. ఈ క్రమంలో ఉదయం రెండు గొర్రెలు అటుగా వెళుతూ షాక్‌కు గురయ్యాయని, అయితే అవి ఎగిరి దూరంగా పడటంతో ప్రాణాలు దక్కించుకున్నాయన్నారు. షాపు నిర్వాహకులు విషయం తెలిసి, నిర్లక్ష్యంగా షాపు మూసేసుకుని వెళ్లారన్నారు. తర్వాత కొద్దిసేపటికి ఆవులు అటువైపుగా రావడంతో ప్రమాదానికి గురై మరణించాయని తెలిపారు. దీనిపై బాధిత రైతు రమణయ్య మాట్లాడుతూ.. ఆవులు తప్ప తనకు వేరే జీవనాధారం లేదని, రూ.2లక్షల విలువచేసే ఆవులు చనిపోయాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు


80 పరుగులు చేసిన విశాఖ బ్యాట్స్‌మన్ రామ్‌చరణ్


65 పరుగులు చేసిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ కార్తీక్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించాల్సిన ప్రకాశం, కర్నూలు మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తొలిరోజు వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోగా, రెండోరోజు గురువారం ఓవర్లు తగ్గించి మ్యాచ్ నిర్వహించారు. బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 39 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులోని రామచరణ్ 80 పరుగులు, వినోద్ 52 పరుగులు, తమన్‌రెడ్డి 51 పరుగులు చేశారు. కడప బౌలర్లు సాయికృష్ణచైతన్య 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. జట్టులోని లోకేష్ 33, యోగాంజనేయులు 23 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు ప్రఖ్యాత్‌వర్మ 2 వికెట్లు తీశాడు. మ్యాచ్ డ్రా కాగా, విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

తూర్పుగోదావరి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 25 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. జట్టులోని కార్తీక్ 65 పరుగులు, రాజ్ అర్యన్ 20 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు కార్తీక్ వర్మ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు 25 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. జట్టులోని పొన్నన్‌నారాయణ 22, రిత్విక్‌రెడ్డి 35 పరుగులు చేశారు.

సమస్త మానవాళికి ఆదర్శం రామాయణం

జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్ : వాల్మీకి మహర్షి రచించిన రామాయణం సమస్త మానవాళికి ఆదర్శమని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా రామాయణాన్ని సమాజానికి అందించారన్నారు. రామాయణం స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏఓబీ కృష్ణుడు, ఆర్ఐ వి.జేజరామకృష్ణ, పోలీసు మోటారు వాహనాల అధికారి పెద్దయ్య, ఎస్బీ సీఐలు టి.వి.సత్యనారాయణ, శంకరయ్య, చలపతి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ, ఆర్ఎస్ఐలు, డీపీఓలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లె వాసి బెంగళూరులో హత్య

వివాహేతర సంబంధమే ప్రాణం తీసింది


బాలాజీ (ఫైల్)

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండల వాసి బెంగళూరులో హత్యకు గురైన సంఘటన గురువారం వెలుగు చూసింది. మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్ల బురుజు దళితవాడకు చెందిన రమణ, నాగమ్మ దంపతుల కుమారుడు శెట్టిపల్లి బాలాజీ (24) ఐటీఐ పూర్తి చేసి బెంగళూరులో ప్రైవేట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అద్దె గదిలో మరో వ్యక్తితో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే ఫ్యాక్టరీలో పని చేసే రామసముద్రానికి చెందిన రెడ్డప్పరెడ్డి పరిచయమయ్యాడు. అతనితో స్నేహం పెరిగి దొడ్డనహళ్లిలో ఉన్న ఇంటికి తరచూ వెళ్లేవాడు. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. ఈ నేపథ్యంలో రెడ్డప్పరెడ్డి భార్యతో బాలాజీ సన్నిహిత సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రెడ్డప్పరెడ్డి, బాలాజీని ఎలాగైనా అంతమొందించాలని పథకం వేశాడు. అందులో భాగంగా ఈనెల 12వ తేదీ శనివారం బాలాజీని మద్యం తాగేందుకు తన ఇంటికి ఆహ్వానించాడు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. బాలాజీ తన ఫోన్‌ను అక్కడే చార్జింగ్ పెట్టాడు. అనంతరం మద్యం మత్తులో ఉన్న బాలాజీని, నరకడంతోపాటు తలపై రాడ్డుతో కొట్టి హతమార్చాడు. అనంతరం భార్యతో కలిసి ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిపోయాడు. అయితే ఆదివారం నుంచి చౌడేపల్లిలో ఉంటున్న బాలాజీ అక్క బావలు అతనికి ఫోన్ చేశారు. పదేపదే చేసినా సమాధానం రాకపోవడంతో అనుమానించారు. వెంటనే అతని బావ బెంగళూరుకు వెళ్లి ఫ్యాక్టరీలోను, తను ఉంటున్న రూమ్ వద్ద విచారించాడు. సరైన సమాచారం రాకపోవడం, సహచరులు సరిగా స్పందించకపోవడంతో. పవనహళ్లి పోలీసులను ఆశ్రయించారు. దీంతో బాలాజీతో పాటు గదిలో ఉంటున్న వ్యక్తి పోలీసులకు వివరాలను తెలిపాడు. శనివారం రూమ్ నుంచి రెడ్డప్ప రెడ్డి ఇంటికి వెళ్లాడని తిరిగి రాలేదని తెలిపాడు. దీంతో పోలీసులు దొడ్డనహళ్లికి చేరుకుని ఇంటి తలుపులు తెరవగా బాలాజీ హత్యకు గురై విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వగ్రామమైన గుండ్ల బురుజు హరిజనవాడలో అంత్యక్రియలు నిర్వహించారు.

మేకల కాపరి ఏమయ్యాడో!

అదృశ్యమై నాలుగు రోజులు గడిచినా లభించని ఆచూకీ


డ్రోన్ కెమెరాలతో గాలిస్తున్న దృశ్యం

అట్లూరు : మేకల కాపరి అదృశ్యమై నాలుగు రోజులు గడిచినా ఇంతవరకు ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఆందోళన రోజు రోజుకు అధికమవుతోంది. మండల పరిధిలోని వరికుంట పంచాయతీ కలావాండ్లపల్లి గ్రామానికి చెందిన సొంటా గంగిరెడ్డి(60) సోమవారం మేకలు మేపుకునేందుకు అడవికి వెళ్లి ఇంటికి రాని విషయం విదితమే. బుధవారం రాత్రి వరకూ గ్రామస్తులు అటవీ ప్రాంతంలో గాలించినా ఫలితం లేదు. అయితే గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరగంరెడ్డి గంగిరెడ్డి సుమారు 60 మంది గ్రామస్తులతో ఒక వైపు గాలిస్తూనే మరో వైపు రెండు డ్రోన్ కెమెరాలను తెప్పించి చీకటిపడే వరకూ గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో శుక్రవారం ఉదయం డ్రోన్ కెమెరాలతో మరలా గాలింపు చేపట్టాలని నిర్ణయించుకున్నారు.

జలవనరుల శాఖలో ఎఫ్ఏసీ అధికారుల నియామకం

కడప/మదనపల్లె : జలవనరుల శాఖలో ఈఈ, డిప్యూటీ ఈఈలుగా పనిచేస్తున్న పలువురికి ఎఫ్ఏసీ ఎస్ఈ, ఈఈలుగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా పెనుకొండ డివిజన్ గోరంట్లలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ పూల గంగాధరను హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్ నెం.11, కదిరి, హంద్రీనీవా సుజలస్రవంతి సర్కిల్–3, మదనపల్లెకు ఎఫ్ఏసీ ఈఈగా బదిలీ చేశారు. పలమనేరు డివిజన్‌లోని కుప్పం ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న గణేనాయక్ సుగాలీని హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్ నెం.12, కుప్పం, హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్–3, మదనపల్లెకు బదిలీ చేశారు. పులివెందుల డివిజన్, కొండాపురం జీకేఎల్ఐ డివిజన్‌లో పనిచేస్తున్న ఏ.ఎల్.శ్రీనివాస్‌ను జీకేఎల్ఐ డివిజన్, పులివెందుల, ఎస్.కే.డీ.జీఎన్ఎస్ఎస్ సర్కిల్, కడపకు బదిలీచేశారు. లింగంగుంట్ల డివిజన్, నరసారావుపేట సబ్ డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర ప్రసాద్‌ను టీజీపీ క్యూసీఅండ్ఐ డివిజన్, ఎస్ఈ డిజైన్స్, క్యూసీ సర్కిల్ కడపకు ఎఫ్ఏసీ ఈఈగా బదిలీ చేశారు. అలాగే ఎన్‌టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్ట్, కడప డివిజన్, బద్వేల్‌లో ఈఈగా పనిచేస్తున్న వి.శేషుబాబును, డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, చీఫ్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) కడపకు ఎఫ్ఏసీ ఎస్ఈగా బదిలీ చేశారు.

అదిగో పులి.. ఇదిగో పులి!

వాట్సాప్ గ్రూపుల్లో వీడియో వైరల్


వాట్సాప్ గ్రూపులో పులి సంచరించే దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : అదిగో పులి.. ఇదిగో పులి అంటూ మండలంలోని మద్దిరేవుల చౌటపల్లి గ్రామస్తులు బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి మండలంలోని మామిడి తోటలో పులి సంచరిస్తోందంటూ వాట్సాప్ గ్రూపుల్లో కొందరు వీడియోను వైరల్ చేశారు. రామాపురం మండలానికి వెళ్లే మార్గంలోని మామిడి తోటలో ఉందంటూ కొందరు, బండ్లపల్లె ప్రాంతంలో ఉందని ఇంకొందరు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు పులి సంచరించే వీడియోను వైరల్ చేయడంతో రెండు మండలాల ప్రజలు పంట పొలాల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. కాగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తోందని వినడం తప్పా తమకు స్పష్టమైన సమాచారం లేదని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఎక్కడో జరిగిన సంఘటనను లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల్లో జరిగినట్లు ప్రచారం చేసి తమను పంట పొలాల వద్దకు వెళ్లకుండా చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


ఆటో డ్రైవర్ అన్వర్ బాషా మృతదేహం

మదనపల్లె : మద్యం వ్యసనం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబంలో గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపం చెంది ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఅవుట్, గాలి మిషన్ సమీపంలో నివాసం ఉన్న రెహమాన్ కుమారుడు షేక్ అన్వర్ బాషా (32) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి బి.కొత్తకోట మండలం గట్టుకు చెందిన తస్లింతో వివాహమైంది. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. అన్వర్‌బాషా ఆటో సంపాదనంతా దుబారా చేస్తూ, మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఇటీవల కొంతమేర అప్పులు చేసి, తిరిగి చెల్లించలేకపోవడంతో ఒత్తిడి అధికమైంది. ఈనెల 14వ తేదీ సోమవారం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. భర్తపై అలిగి భార్య తస్లీమ్ పిల్లలను వెంటబెట్టుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న అన్వర్‌బాషా బుధవారం రాత్రి ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య తస్లీమ్ బుధవారం సాయంత్రం నుంచి భర్తకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో గురువారం మధ్యాహ్నం ఆమె రామిరెడ్డి లేఔట్ చేరుకుని ఇంట్లోకి వెళ్లి చూడగా, భర్త ఆత్మహత్య చేసుకుని ఉండడాన్ని గుర్తించింది. బోరున విలపిస్తూ, వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించింది. దీంతో వన్ టౌన్ సీఐ చాంద్ బాషా సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుని సోదరుడు నదీమ్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకుని..


ఉరివేసుకుని మృతి చెందిన నాగరాజు

బి.కొత్తకోట : మండలంలోని గుడిపల్లె అటవీ ప్రాంతంలో వాయల్పాడుకు చెందిన వ్యక్తి చెట్టుకు ఉరివేసుకు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడు చెట్ల వేరుగడ్డలను సేకరించుకుని జీవిస్తున్న నాగరాజు (52)గా పోలీసులు గుర్తించారు. వీఆర్ఓ సమక్షంలో పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబీకుల నుంచి ఫిర్యాదు స్వీకరించాక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతికి సంబంధించి కారణాలు ఇంకా తెలియరాలేదు.

గ్రీన్ హైవేలో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

బ్రహ్మంగారిమఠం : నేషనల్ గ్రీన్ హైవేలో భూములు కోల్పోయిన మండలంలోని మల్లేపల్లె, ముడుమాల, పలుగురాళ్లపల్లె పంచాయతీలోని గ్రామాలకు చెందిన రైతులకు తక్షణం రుణ సహాయం అందేలా చూడాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డిలు రెవిన్యూస్పెషల్ కలెక్టర్ వెంకటపతిని కోరారు. గురువారం సాయంత్రం బి.మఠం తహసీల్దార్ కార్యాలయంలో భూములు కోల్పోయి ఇంకా నష్ట పరిహారం అందని రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానంగా చుక్కల భూములు, డీకేటీ పట్టాలకు ఇంతవరకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందించిన స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారి అవార్డులను పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, డిప్యూటీ సర్వేయర్ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.